విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 31 జనవరి 2025 8 పేజీలు

ఆర్‌అండ్‌బీ రోడ్డును వదల్లేదు...



సర్వే నెంబర్ మార్చి పత్రాలు

యర్రగొండపాలెంలో అధికారుల లీలలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెంలో కొందరు అధికారుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మామూళ్ల మత్తులో భూములను ఇష్టా రీతిన కట్టబెట్టేస్తున్నారు. పూర్వీకుల ఆస్తిగా ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఏకంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలాన్నే ప్రైవేట్ వ్యక్తుల పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. అసలు రికార్డుల్లో లేని భూమిని రిజిస్టర్ చేసి ఇటీవల సస్పెండ్ అయిన యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ ఘటన మరువక ముందే తాజాగా బయటపడ్డ వ్యవహారం పట్టణంలో ఇప్పుడు చర్చనీయాంశమైంది.

రూ.లక్షల్లో స్థలం విలువ : పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా ఎదుట జాతీయ రహదారి-565 నుంచి కొలుకుల రోడ్డుకు వెళ్లేందుకు సర్వే నం.559లో రెండెకరాల ఆర్‌అండ్‌బీ స్థలం ఉంది. ఈ భూమిలోని కొంతభాగంలో ఆర్‌అండ్‌బీ అధికారులు సీసీ రోడ్డు వేయగా మిగతాది అంచుల కింద ఉండిపోయింది. బంగ్లా ఎదురుగా రోడ్డుకు ఉత్తరం వైపునున్న ఖాళీ స్థలంలో గతంలోనే పంచాయతీ తాగునీటి బోరు, నీటి ట్యాంకు ఉండగా... మిగతాది ఖాళీగా ఉంది. ఎఫ్ఎంబీ ప్రకారం బంగ్లా ప్రహరీ నుంచి 117 లింకుల(77 అడుగులు) వెడల్పుతో రహదారి విస్తరించి ఉంది. అటు జాతీయ రహదారి, ఇటు ఆర్‌అండ్‌బీ సీసీ రోడ్డుకు మలుపులో ఉండడంతో దీని విలువ రూ.లక్షల్లో ఉంది. దీంతో కొందరి కళ్లు ఈ భూమిపై పడ్డాయి. పక్కనున్న 58/1 సర్వే నంబరుతో ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. వీటిపై గ్రామ సర్వేయర్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, తహసీల్దార్ సంతకాలు చేసి సీల్ వేశారు. సదరు పత్రాల ఆధారంగా దొడ్డపనేని శ్రీనివాసరావు అనే వ్యక్తి తన భార్య పేరుపై ఈ నెల 22న గిఫ్ట్ రిజిస్ట్రేషన్ మిగతా 2 లో ...

చంద్రబాబు ఫెయిల్యూర్ సీఎం

- సూపర్ సిక్స్ పథకాలు అమలులో విఫలం
- గెలిచిన ప్రతిసారి అబద్ధాలతో పాలన
- దావోస్ నుండి రిక్తహస్తాలతో వచ్చిన చంద్రబాబు
- ఆదిమూలపు వైసీపీ వీడేది అబద్ధం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర -ఒంగోలు : నాలుగు సార్లు సీఎం అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు..ఫెయిల్యూర్ సీఎం అని వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మిగతా 2 లో ...

అర్జీల పరిష్కారంలో కాలయాపన సహించం

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

2లో

వైసీపీ హయాంలో అన్నీ అప్పులే..

- రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న చంద్రబాబు
- సలగల రాజశేఖర్ బాబు వెల్లడి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : గత వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసి ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలుతో పాటు రూ.1,40,000 కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సిన దుర్మార్గమైన పరిస్థితి దాపరించిందని బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో విద్యానగర్‌లో ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అస్తవ్యస్తంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అలుపెరుగని కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన ఏడు నెలల కాలంలో రూ.22 వేల కోట్లు అప్పుల రూపంలో చెల్లించడం జరిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న నేపథ్యంలో ఆదాయంలో అత్యధిక భాగం గత ప్రభుత్వం చేసిన మిగతా 2 లో ...

గ్రూప్-2 స్టడీమెటీరియల్ అందజేయాలి

- అభ్యర్థులకు ప్రభుత్వ సాకారం ఉండాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జేబీ శ్రీధర్

విశాలాంధ్ర - బాపట్ల : ఫిబ్రవరి 23వ తేదీన జరిగే గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు వేలాదిమంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని వారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ స్టడీ మెటీరియల్ అందజేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జెల్ది భాగ్య శ్రీధర్ డిమాండ్ చేశారు. బాపట్ల పట్టణం సూర్యలంక రోడ్డు ఏజీ కాలేజీ ఎదురుగా ఉన్న టౌన్ హాల్ కళాక్షేత్రం న్యూస్ పేపర్స్ క్లబ్ ఆవరణలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కొలువులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వం స్థానిక గ్రంథాలయాల్లో ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో విద్యా కేంద్రంగా వెలసిల్లుతున్న బాపట్ల మినీ బాసరగా ప్రసిద్ధి చెందుతూ అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు వేల మంది విద్యార్థులు సిద్ధమయ్యారని వారి ప్రతిభ కనబరచుటకు పరీక్ష పోటీలలో ప్రథమలుగా ఉత్తీర్ణత సాధించడానికి వారికి కావాల్సిన స్టడీ మెటీరియల్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ లాండ్స్ నిధులు కింద జిల్లా గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలో నూతన జిల్లా గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, ఏఐవైఎఫ్ పట్టణ నాయకులు కోటా నాగరాజు, న్యూస్ పేపర్ క్లబ్ పాటకులు బి.నాగసాయి, మోహన్ గోపి, జో బాబు, చింతా శంకర్రావు, బి.వెంకట్రావు, బి.వెంకటేష్, షేక్ రఫీ, అల్లూరి పవన్, వంశి, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా మహాత్మా గాంధీ వర్ధంతి

6 లో

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

2లో

తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పలు రికార్డింగ్ పరిశీలించి ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలు అన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సురేష్ డిప్యూటీ తహసీల్దార్ అరుణను ఆదేశించారు.

ఉత్తమ కేఎంపీఎల్ డ్రైవర్‌గా ఎం.బాల కాశయ్యకు అవార్డు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మార్కాపురం డిపో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.బాల కాశయ్య గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ అవార్డు ప్రశంస పత్రాన్ని ఆదివారం ఒంగోలులో గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా అధికారుల చేతుల మీదుగా కేఎంపీఎల్‌గా అవార్డు అందుకున్న కాశయ్యకు మార్కాపురం డిపో మేనేజర్ నర్సింలు అభినందనలు తెలియజేశారు. కార్మికులు అభినందనలు తెలియజేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన సంఘటన మండలంలోని చిన్న ఓబినేపల్లి గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన రాజమ్మ అనే మహిళ గ్రామ సమీపంలోని బస్టాండ్‌లో నిలబడి ఉండగా, బైక్ పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలో నుంచి బంగారు సరుడు తెంచుకొని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డును వదలల్లేదు..

(మొదటిపేజీ తరువాయి)

చేయించుకున్నారు.

తూచ్..ఆ సంతకం నాది కాదు

ఈ విషయమై యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్ సుల్తాన్ బాషా మాట్లాడుతూ.. పంచాయతీ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన యాజమాన్య ధ్రువీకరణ పత్రం ఆధారంగానే తాము రిజిస్ట్రేషన్ చేశామన్నారు. స్థలం పూర్వీకులదని తహసీల్దార్ ధ్రువపత్రం ఇవ్వడంతో నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలు లేవన్నారు. ఇదిలా ఉంటే రిజిస్ట్రేషన్ పత్రాల ధ్రువీకరణలో సర్వే చేసినట్టు ఉన్న సంతకం తనది కాదని యర్రగొండపాలెం-4 గ్రామ సర్వే యర్ దిలీప్ పేర్కొనడం గమనార్హం.

వైసీపీ హయాంలో అన్నీ అప్పులే..

(మొదటిపేజీ తరువాయి)

అప్పులకే సరిపోతుందన్నారు. డిగ్రీ ఫీజు రీయింబర్స్ మెంట్ రూ.2800 కోట్లు అదేవిధంగా కొట్లాది రూపాయలు వసతి దీవెన, వందల వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించకుండా వెళ్లిపోయిన పరిస్థితి ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏదో ఒక విధంగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే పట్టుదలతో కంకణం కట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు సాధించడమే గాక పారిశ్రామికవేత్తలను ఒప్పించి మెప్పించి ఈ రాష్ట్రానికి రప్పించి పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టించి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి జీవనాడులైన పోలవరం అభివృద్ధి, ఇటు అమరావతి అభివృద్ధి కి కంకణం కొట్టుకొని పనిచేస్తున్న పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న రాష్ట్రానికి రాజధానిని నిర్మించి ఒక ఉన్నతమైన రాజధాని నిర్మాణానికి చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. ఒక్క హైదరాబాదు నగరంలోనే రూ.30 వేల కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు. దావోస్ లో జరిగిన పారిశ్రామికవేత్తల సదస్సులో గతంలో రాష్ట్రానికి రావాలంటే భయపడే పారిశ్రామికవేత్తలు సైతం తిరిగి రాష్ట్రానికి రప్పించే విధంగా చంద్రబాబు చేసిన కృషి అభినందనీయమన్నారు. రూ.10 లక్షల కోట్లు అప్పు రాష్ట్ర ప్రజలకు గుదిబండగా మారిన వాస్తవాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని రాజశేఖర్ బాబు మనవి చేశారు.రాష్ట్ర పు:న నిర్మాణం కోసం జరుగుతున్న కృషిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

అర్జీల పరిష్కారంలో కాలయాపన సహించం

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-తర్లుపాడు : తక్షణమే పరిష్కరించదగిన సమస్యలను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేస్తే సహించబోనని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా హెచ్చరించారు. గురువారం ఆమె తర్లుపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చిన ఒక వ్యక్తితో ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా ఫోనులో మాట్లాడారు. " అధికారులు మీతో మాట్లాడారా ?... మీ సమస్యను అడిగి తెలుసుకున్నారా..? "... అని సదరు అర్జీ దారుని నుంచి కలెక్టర్ వివరణ తీసుకున్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని అధికారులకు ఆమె స్పష్టం చేశారు. భూముల మ్యుటేషన్ ప్రక్రియలో నిబంధనలు పాటించాలని కలెక్టర్ పునర్ఘాటించారు. ఈ ఒక్కరితోనే ముగించబోనని, రెవిన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చిన ప్రజలతో ర్యాండంగా తాను ఫోనులో మాట్లాడతానని ఆమె స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా చేద్దాములే , చూద్దాంలే అంటూ క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని కలెక్టర్ హెచ్చరించారు. కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేస్తున్న సమయంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

బాలికలకు స్వేచ్ఛ, సాధికారతకు ప్రాధాన్యం

విశాలాంధ్ర-మార్కాపురం : బాలికలకు స్వేచ్ఛ, సాధికారత అత్యంత ప్రాధాన్యమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఈ దిశగానే జిల్లాలో 'బంగారు బాల్యం' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. బాలల హక్కుల చట్టాలపై గురువారం మార్కాపురంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీడీపీఓలు అంగన్వాడి సూపర్వైజర్లకు నిర్వహించిన డివిజన్ స్థాయి అవగాహన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట్ సహదిత్ త్రివినాగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాలల సమగ్ర ఎదుగుదలకు, ముఖ్యంగా బాల్య వివాహాలను నివారించి సాధికారత దిశగా బాలికలు ఎదిగేలా "బంగారు బాల్యం" కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. బాల్య వివాహాలు, పోషకాహార లోపం స్థాయి నుంచి బాలల బంగారు భవిష్యత్తుకు ప్రథమ స్థానంలో ప్రకాశం జిల్లా ఉండేలా మార్పు తీసుకు రావాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ దిశగా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను కలెక్టరు ప్రస్తావించారు. బాలికల ఆరోగ్యం, సంతోషం, సురక్షిత, సాధికారత లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులతో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో బంగారు బాల్యం కమిటీలను నియమించామన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

- స్మార్ట్ మీటర్స్ వల్ల ఉపాధి కోల్పోతున్న వారికి న్యాయం చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ డిమాండ్

విశాలాంధ్ర - కనిగిరి : స్మార్ట్ మీటర్స్ వల్ల ఉపాధి కోల్పోతున్నటువంటి విద్యుత్ మీటర్ రీడర్స్ కు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్ డిమాండ్ చేశారు. స్థానిక దరిశి చెంచయ్య భవనం నందు గురువారం ఏటియుసి ఉపాధ్యక్షులు గుజ్జుల బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఏఐటియుసి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షులు సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడర్స్ చేత వెట్టి చాకిరి చేయించుకుని ప్రభుత్వాలు వారిని విస్మరించాయని గతంలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేస్తున్న సమయంలో ఎవరైతే విద్యుత్ మీటర్స్ రీడర్స్ గా పని చేస్తున్నారో వారందరినీ రెగ్యులైజేషన్ చేసి ఖచ్చితమైన జీతభత్యాలు అందేలా చూస్తామని అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని విస్మరించారని అలాగే చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాక ముందు విద్యుత్ మీటర్ రీడర్స్ ను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తానని నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్స్ పేరా ప్రజల వద్ద అధిక విద్యుత్ చార్జీలు వసూలు చేయడమే కాక విద్యుత్ మీటర్ రీడర్స్ యొక్క ఉపాధికి గండి కొట్టే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుందని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా విద్యుత్ మీటర్ రీడర్స్ చేత వెట్టి చాకిరి చేయించుకొని చాలీచాలని జీతాలు ఇచ్చి నేడు పూర్తిగా వారిని తొలగించే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తుందని ఆ ప్రయత్నాన్ని మానుకొని వెంటనే ప్రభుత్వాలు స్పందించి విద్యుత్ మీటర్ రీడర్స్ ను రెగ్యులర్ ప్రతిపాదికన ఉద్యోగాలలోకి తీసుకుని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మీటర్ రీడర్స్ జిల్లా నాయకులు మాట్లాడుతూ మేము గత 25 సంవత్సరాలుగా విద్యుత్ డిపార్ట్మెంట్లో మీటర్ రీడింగులు తీస్తున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా లో 300 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లో 4,000 మంది విద్యుత్ మీటర్ రీడర్స్ ఉన్నారని, ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల వీరంతా ఉపాధిని కోల్పోతున్నారని మీటర్‌కి సిమ్ సిస్టం పెట్టడం వల్ల మేమంతా ఉపాధి కోల్పోయామని విద్యుత్ మీటర్ రీడర్స్ యొక్క కుటుంబాలు ఉపాధి లేక రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నూతన డివిజన్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. డివిజన్ అధ్యక్షుడిగా పి. పిచ్చయ్య, కార్యదర్శిగా అబ్దుల్, డివిజన్ కోశాధికారిగా జి.ఎలీషా, డివిజన్ ఉపాధ్యక్షుడు జి. ఐజాక్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రభాకర్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ రీడర్స్ జిల్లా కార్యదర్శి కుంచాల సిద్దయ్య జిల్లా ఉపాధ్యక్షుడు బి. నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్, రీడర్స్ మల్లికార్జున, సత్యం, ప్రసాదు, రవి, ఏడుకొండలు, పాల్గొనడం జరిగింది.

చంద్రబాబు ఫెయిల్యూర్ సీఎం

(మొదటిపేజీ తరువాయి)

బాచేపల్లి మాట్లాడుతూ ఎన్నికల ముందు గెలుపు కోసం అలవికాని హామీలను ఇవ్వటంలో చంద్రబాబు దిట్ట అన్నారు. ఎన్నికల తర్వాత ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో విఫలం అవటం చంద్రబాబుకు పరిపాటిగా మారింది అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేమని చేతులెత్తేసిన చంద్రబాబు నాయుడు రాజీనామా చేసి తిరిగి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాం కాలంలో కరోనా రోజులలో కూడా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా, మంచి పరిపాలన అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిది అన్నారు. దావోస్ వెళ్లి రాష్ట్రానికి ఎటువంటి పెట్టుబడులు తీసుకురాకుండా వచ్చిన ఘనత దేశంలోని మొదటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ లకు దక్కుతుందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత తనదేనని ఎన్నికలకు ముందు గొప్పలు పలికిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్థిక పరిస్థితి బాగోలేని రోజులలో కూడా జగన్ కాపు నేస్తం ద్వారా కాపు సామాజిక వర్గం ప్రజలకు ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. కాపు నేస్తం కొనసాగించాలని చంద్రబాబు నాయుడు పై ఒత్తిడి తేవాలని పవన్ కళ్యాణ్ ను డిమాండ్ చేశారు. స్వ లాభాల కోసం బాలినేని ఆధ్వర్యంలో పార్టీలు మారే కార్పొరేటర్ల వల్ల వైసీపీకి వచ్చిన నష్టం ఏమీ లేదని తెలిపారు. వైసిపి ఒంగోలు సమన్వయకర్త చుండూరి రవిబాబు మాట్లాడుతూ ప్రతి ఎన్నికలలో చంద్రబాబు అబద్ధాలు చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. పరిపాలన చేతకాక, ప్రజల నుండి డబ్బులు వసూలు చేయటం చంద్రబాబుకు తెలిసిన పరిపాలన అన్నారు. 8 నెలల పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేక రోజు కొక వివాదాన్ని తెరపైకి చేస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ జేబులు నింపుకోవడమే కాకుండా, ప్రజా సమస్యలపై దృష్టి సాధించాలని హితవు పలికారు.

మాజీ మంత్రి ఆదిమూలపు వైసీపీలోనే

మాజీ మంత్రి ఆది మూలపు సురేష్ పార్టీ మారుతున్నారనే ప్రచారం అబద్ధం బాచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. వైసిపి పార్టీ ఆవిర్భావం నుండి ఆదిమూలపు పార్టీలోనే కొనసాగారన్నారు. 2014 ఎన్నికల సమయంలో అనేక కేసులను ఎదుర్కొని పార్టీలే జగన్కు అండగా నిలిచిన వ్యక్తి ఆదిమూలపు అన్నారు. జగన్ ఎక్కడ చెబితే అక్కడ పోటీ చేసే వ్యక్తి ఆదిమూలపు సురేష్ అని తెలిపారు. ప్రస్తుతం ఆదివారపు కొండెపి నియోజకవర్గం లోని పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, స్థానికంగా కమిటీలు కూడా వేశారని గుర్తు చేశారు. సమావేశంలో వైసిపి ఒంగోలు నగర అధ్యక్షులు కటారి శంకర్, జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, కార్పొరేటర్ ఇమ్రాన్, ఇందిరా, నగరగంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇక ఎల్ పీ నంబర్ల శకమే!

తహసీల్దార్‌తో ముఖాముఖి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : భూ రికార్డుల క్రమబద్ధీకరణలో భాగంగా భూముల రీసర్వే చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకుపోతోంది. గత వైసీపీ హయాంలో ఈ రీసర్వే ప్రక్రియ ప్రారంభం కాగా, కూటమి ప్రభుత్వం వచ్చాక, దీన్ని కొనసాగించాలా...? వద్దా.? అన్న అంశంపై మల్లగుల్లాలు పడి చివరకు కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో సర్వేనంబర్ల శకం ముగిసి ఎల్పీ (ల్యాండ్ పార్శిల్ నంబర్లు) శకం ప్రారంభమైనట్లు అయ్యింది. ఇప్పటికే రీసర్వే చేసిన భూముల్లో సదస్సులు నిర్వహించి సమస్య పరిష్కారానికి అవకాశం కల్పించింది. తాజాగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి మళ్లీ కొత్తగా ఆయా గ్రామాల్లో రీసర్వే చేయిస్తోంది. దీనిలో భాగంగా ప్రస్తుతం నాగులుప్పలపాడు మండలం పోతవరంలో రీసర్వే చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ పలు అంశాలను 'విశాలాంధ్ర'తో పంచుకున్నారు.

విలేకరి : కొత్తగా రీసర్వే చేస్తున్న పోతవరంలో ఎన్నిరోజుల్లో సర్వే పూర్తవుతుంది?

తహసీల్దార్ : ప్రభుత్వ నిర్దేశాల ప్రకారం 60 రోజుల్లో రీసర్వే పూర్తి చేయాలి. లక్ష్యం మేరకు పూర్తి చేసి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం. ఇక సర్వే జరిగే సమయంలో ప్రతి రైతుకు నోటీసులు ఇచ్చి విధిగా సమాచారం ఇస్తాం.

విలేకరి: రీసర్వే చేసే గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచి రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీన్ని ఎలా అధిగమిస్తారు.

తహసీల్దార్ : ఈ విషయం వాస్తవమే. అయితే రైతులకు ఇబ్బంది లేకుండా చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే మండలంలో ఆరు గ్రామాల్లో రీసర్వే జరగ్గా ఆయా గ్రామాల్లో ఎల్పీ నంబర్లపై రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఆ నంబర్లపైనే ఈసీ వస్తోంది. బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తున్నారు. ఈ అంశంలో సబ్ రిజిస్ట్రార్ కలిసి రైతులకు ఇబ్బంది లేకుండా చొరవ తీసుకుంటున్నాం..

విలేకరి : గతంలో 22(ఈ) కింద గ్రామ కంఠం భూములన్నింటిలో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

తహసీల్దార్: గ్రామకంఠం భూములను దేవదాయశాఖ హెూల్డ్ లో పెట్టింది. దీనిపై ఆ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాం. వారి భూములు ఎంత వరకు ఉంటే అంత వరకు సబ్ డివిజన్ చేసి మిగిలిన భూమిని రిలీజ్ చేస్తాం. అయితే వారు ముందుకు రావాల్సి ఉంది.

విలేకరి : ప్రస్తుతం కొత్తగా పాసుపుస్తకాల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ పాసుపుస్తకాలు ఎన్నిరోజుల్లో వస్తాయి?

తహసీల్దార్: ప్రభుత్వ నిర్దేశాల ప్రకారం 45 రోజుల్లో పాసుపుస్తకాలు మంజూరు కావాల్సి ఉంది. మా వద్దకు మ్యూటేషన్ కోసం వచ్చే రైతులకు పెండింగ్ లేకుండా చూస్తున్నాం.

విలేకరి : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్పీ నంబర్ల సమస్య తీవ్రంగా ఉంది. కొంత మందికి ఈ సమస్య ఏమిటో కూడా తెలియని పరిస్థితి ఉంది. దీన్ని ఎలా పరిష్కరిస్తారు?

తహసీల్దార్ : జాయింట్ ఎల్పీల సమస్య తీవ్రంగా ఉన్నమాట వాస్తవమే. మా సిబ్బంది నేరుగా రైతులకు సమస్యను వివరించి పరిష్కారం చూపుతున్నారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియే.

విలేకరి: తరతరాలుగా భూములకు సంబంధించి సర్వేనంబర్లకు ప్రజలు అలవాటు పడ్డారు. ప్రస్తుత ఎల్పీ నంబర్లపై ప్రజల్లో గందరగోళం ఉంది.

తహసీల్దార్ : ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాల్లో భాగంగా ఎల్పీ నంబర్లను తీసుకొచ్చింది. ప్రజలకు రైతులకు కూడా త్వరలో అలవాటవుతుంది. ఇప్పటికే గ్రామపటాలు, ఎఫ్ఎంబీలు ఎల్పీనంబర్లతో ఏర్పాటు చేశాం. రీసర్వే పూర్తయితే అన్ని గ్రామాల్లో సర్వేనంబర్ల స్థానంలో ఎల్పీనంబర్లు వస్తాయి.

విలేకరి : గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సర్వేరాళ్లు వివాదస్పదమయ్యాయి. ప్రస్తుతం ఎలాంటి సర్వేరాళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

తహసీల్దార్ : భూమి వివరాలు తెలిసేలా కొత్తగా ప్రభుత్వం సర్వేరాళ్లను తీసుకొచ్చింది. వాటినే రైతుల భూములకు హద్దుగా ఏర్పాటుచేస్తాం.

గాంధీజీకి నివాళులర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్య సముపార్జించిన జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వారి చిత్ర పటానికి శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహింస అనే ఆయుధంతో సూర్యడస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి భరతమాత దాస్యశృంఖలాల నుంచి విముక్తి కలిగించిన మహెూన్నతుడు మహాత్మాగాంధీ అని, 20వ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మాగాంధీ ఒకరని తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపారని, భారతదేశంపై చెరగని ముద్ర వేసి దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కృషి చేద్దామన్నారు.

మానవాళికి మార్గదర్శి.. మహాత్మ గాంధీ

విశాలాంధ్ర-గిద్దలూరు : సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ స్వాతంత్రాలు అందించిన మన జాతిపిత మహాత్మా గాంధీ. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ అహింసా వాదంతో ఎంతటి కఠిన లక్ష్యాన్ని చేదించవచ్చునని నిరూపించి, వలసదారుల చెర నుండి అఖండ భారతావనికి విముక్తి కలిగించి ప్రపంచానికి నూతన పోరాట ఒరవడిని నేర్పిన జాతిపిత మహాత్మా గాంధీ అన్నారు.

50మంది దాతలు రక్తదానం

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గొప్ప మహెూన్నత కార్యక్రమాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆదాం, ప్రముఖ గ్యాస్ట్రోలాజిస్ట్ డాక్టర్ కిరణ్ రక్తదాన శిబిరం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గిద్దలూరు పట్టణం మరియు పరిసరాల యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి మరో ప్రాణానికి జీవితం అందించగలిగారు. పలువురు పెద్దలు మాట్లాడుతూ రక్తదానం చేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ రానున్న రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలనీ యువతకు మార్గదర్శక ముగా నిలవాలని వాపోయారు. ఈ కార్యక్రమంలో 50మంది రక్తదాతలు రక్తదానం చేయడం చాలా సంతోషకరం అని అవోపా నిర్వాహకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దారా రాములు, అవోపా అధ్యక్షులు, కె.సుభారావు కార్యదర్శి, సూరె సుబ్బరామయ్య పాల్గొన్నారు.

ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్ల గట్టు గ్రామంలో పశు వైద్యాధికారి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు ఆరోగ్యవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 35 46 గొర్రెలు మేకలకు, 63 దూడలకు నట్టల నివారణ మందు తాపించామన్నారు. 10 గేదెలకు కృత్రిమ గర్భాధారణ ఇంజక్షన్ ఇచ్చామని, ఆరు గేదెలకు చూడు పరీక్షలు చేశామని డాక్టర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. పశువులు గొర్రెలు మేకలలో వచ్చాడు జబ్బులు గురించి వివరించి నివారణ చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పోషకులు పెంపకం దారులకు వివరించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.సుఖదేవ్ బూన్, టిడిపి నాయకులు పరిటాల సుబ్బయ్య, వేముల తిరుపతయ్య పొదిలి తిరుపతయ్య, వేముల శ్రీనివాసులు, ప్రభాకర్, పోలసాని సంజీవరెడ్డి నారాయణరెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్యం, అహింసలే ఆయుధాలు

విశాలాంధ్ర-పామూరు : సత్యం, అహింసలే ఆయుధాలుగా దేశానికి స్వాతంత్ర్య సముపార్జించిన జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక సి ఎస్ పురం రోడ్డులో గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి మహనీయునికి టిడిపి నేతలు ఘన నివాళిలు అర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, పందికి హరీష్, సయ్యద్ అమీర్ బాబు, మెంటా నరసింహారావు, మాజీ సర్పంచ్ డి.వి.మనోహర్, టి.వి.కె. సుబ్బారావు, ఐరి కోటిరెడ్డి పాల్గొన్నారు.

12వసారి రక్తదానం

విశాలాంధ్ర-కొమరోలు : హైదరాబాద్ నగరంలోని సూరారం మల్లారెడ్డి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మధు నాయక్ అనే పేషెంట్‌కు హార్ట్ సర్జరీ నిమిత్తం అత్యవసర పరిస్థితుల్లో ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉందని డాక్టర్లు తెలిపారు. గత ఐదు రోజుల నుంచి రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గానికి చెందినటువంటి అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బి. శివమణి యాదవ్ అనే యువకుడు మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే హాస్పటల్‌కు వెళ్లి ఆ వ్యక్తికి ఓ పాజిటివ్ రక్తాన్ని డొనేట్ చేసి పేషెంట్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపత్కాలలో వెంటనే స్పందించినందుకు పేషెంట్ యొక్క కుటుంబ సభ్యులు శివమణి యాదవ్ కు మరియు అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమ్మ ఫౌండేషన్ కోశాధికారి సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రక్తం అవసరాలు ప్రతి రోజు పెరుగుతున్నాయి...ఎంతో మంది గర్భిణీ స్త్రీలు.., తలసేమియా చిన్నారులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం ఎదురుచూస్తున్నారు మన వంతుగా మరో అడుగు ముందుకు వేద్దాం రక్తం కోసం ఏ ఒక్కరు ఇబ్బంది పడకుండా రక్తదానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుదాం అని పేర్కొన్నారు. అలాగే ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో రక్తం కావాలన్నా రక్తం ఇవ్వాలని ఆసక్తి ఉన్నవారు సెల్ నెంబర్:-9848841739.ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-దొనకొండ: ఫిబ్రవరి 3,4,5వ తేదీల్లో నెల్లూరులో సీపీయం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలంటూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య కోరారు. ఈ సభలకు అఖిల భారత నాయకులు, పొలిట్ బ్యూరో సభ్యులు, బృందాకారత్, కామ్రేడ్ బేబి, కామ్రేడ్ రాఘవులు హాజరవుతారని, మండలం నుండి అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-కొమరోలు : ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని మరో ద్విచక్ర వాహనం ఢీ కొనటంతో ఓ వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటన కొమరోలు మండలంలోని శింగర పల్లె క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. శింగర పల్లె క్రాస్ రోడ్డు వద్ద పక్కకు ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొనటంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

అహింసతో దేశానికి స్వాతంత్య్రం

మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

విశాలాంధ్ర-ఒంగోలు : అహింసతో దేశానికి స్వాతంత్య్రం సాధించిన మహనీయుడు గాంధీజీ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గాంధీరోడ్డులోని గ్రామచావడి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నగర మేయర్. గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, పలు సంఘాల నేతలు, జిల్లా అధికారులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశం కోసం, స్వాతంత్య్రం కోసం గాంధీజీ చేసిన త్యాగాలకు, సేవలకు గుర్తింపుగా ఆయనను మనం జాతిపితగా గౌరవించుకుంటున్నామన్నారు. స్వపరిపాలన, సుపరిపాలన గాంధీజీ ఆశయాలని, ఆయన చూపిన బాటలో మన మందరం నడవాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా అందచేయడానికే రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ సేవలను ప్రారంభిస్తున్నట్లు మంత్రి చెప్పారు. నేడు ప్రతిఒక్కరి వద్ద స్మార్ట్ ఫోన్ ఉందని, దీని ద్వారా ప్రభుత్వ సేవలను సులభంగా పొందవచ్చన్నారు. మేయర్ మాట్లాడుతూ మహాత్ముని స్ఫూర్తితో రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అహింసే ఆయుధంగా పోరాడిన గాంధీజీని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ .బి.చిన ఓబులేసు, ఏ.ఎస్.పీ. అశోక్ బాబు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ పసన్న, డి.ఎస్.పి. ఆర్. శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య పింఛన్ దారుల విచారణ

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని పలు గ్రామాలలో నెల నెలా 15 వేల రూపాయలు తీసుకుంటున్న పింఛన్ దారులను వైద్య బృందం రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టింది. అందులో భాగంగా రెండో రోజు గురువారం మండలంలోని వర్గంపల్లి, చిలంకూరు, చింతలపాలెం, రావిగుంట పల్లి, పడమర కట్టకిందపల్లి గ్రామలలో ఆరోగ్య పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల అర్హత పత్రాలను పరిశీలించారు. మండలంలో 30 పింఛన్లు ఉండగా బుధవారం 18, గురువారం 12 విచారణ చేసినట్లు ఎంపీడీవో బి సురేష్ తెలిపారు. వైద్య బృందంలో డాక్టర్ బి ఆంజనేయులు, డాక్టర్ సౌజన్య, డాక్టర్ ఎం విజయ కుమార్ పాల్గొంటున్నారు.

మిరపలో నల్లి తామర

విశాలాంధ్ర-ముండ్లమూరు : మిరప పంటలో నల్లి, తామర పురుగు ఆశించినదని దాని పట్ల రైతులు తగు సూచనలు సలహాలు పాటించాలని ఉద్యానవన అధికారి వీఎం రవి వెంకన్న బాబు అన్నారు. మండలంలోని ఉమామహేశ్వర గ్రామంలో గురువారం ఆయన మిరప పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నల్లి పురుగులు ఆకు అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చడం వలన ఆకులు వెనుకకు ముడుచుకుపోయి తిరగేసిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. దీని నివారణకు డైకో ఫాల్ ఐదు మిల్లి లీటర్లు ఒక లీటర్ నీటి కలిపి పది రోజులు వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని తెలియజేశారు. దీని నివారణకు ఎసిఫేట్1. ఐదు గ్రాములు లేదా ఫిఫ్రోనిల్ రెండు మిల్లీమీటర్లు లేదా క్లోరిఫైనీ ఫెయిర్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటి కలిపి అవసరాన్ని బట్టి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సత్యం, అహింస మహాత్ముని ఆయుధాలు

విశాలాంధ్ర-దొనకొండ: సత్యం, అహింసా రెండింటిని మహాత్మా గాంధీ ఆయుధంగా మలచి బ్రిటీష్ వారిని తరిమి కొట్టారంటూ ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షులు కాళ్ళ హనుమంతురావు తెలిపారు. మహాత్ముని వర్ధంతి సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆయన

విగ్రహానికి మండల ఆర్య వైశ్య సంఘం వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణార్పణ చేసిన గాంధీజీని స్మరించుకుంటూ కొద్దిసేపు మౌనం వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ మండల నాయకులు కాళ్ళ హనుమంతరావు, ఏ.శంకర్, బివి శేఖర్, పట్టణ నాయకులు పరుచూరి రమేష్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

ముస్లిం బజారులో చోరీ

విశాలాంధ్ర-దొనకొండ: స్థానిక ముస్లిం బజారులో చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు షేక్.పాపా తెలిపిన వివరాలు... సుమారు 15 రోజుల క్రితం కుటుంబ సభ్యులతో తాము విజయవాడకు వెళ్ళిన విషయాన్ని గుర్తించిన గుర్తు తెలియని దొంగలు ప్రహరీ గోడ దూకి తాళం పగలకొట్టి లోపలి బీరువాలోని బంగారు చెవి కమ్మలు, 20 తులాల వెండి పట్టీలు, వెండి గిన్నెలు, 5 వేల నగదు, విలువైన వస్త్రాలతో కలిపి మొత్తం సుమారు లక్ష మేర దోచుకెళ్ళారంటూ తెలిపారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశామన్నారు. పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో చోరీ జరగటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : దూపాడు గ్రామ సర్పంచ్ ఏనిబెర అనూష ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటు చేయడం జరిగింది. వైద్య శిబిరంలో యల్‌వి ప్రసాద్ కంటి వైద్య సిబ్బంది అక్కడికి వచ్చిన కంటి సమస్య బాధితులను పరీక్షించారు. అందులో సుమారుగా 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 మందికి కంటి శాస్త్ర చికిత్స అవసరమని నిర్ధారించారు. వారిని శాస్త్ర చికిత్స నిమిత్తం మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్కరు నడచుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గోపవరపు గురునాధం అన్నారు. మండలకేంద్రమైన పుల్లల చెరువులోని మహాత్మాగాంధీ కళా ప్రాంగణం వద్ద మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గురునాధం,ఆర్యవైశ్య ప్రముఖులు,గ్రామ పెద్దలు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు ఉప్పల.హనుమంతరావు, గజ్వల్లి భాస్కరరావు, గాజులపల్లి కృష్ణయ్య, చిల్లంచర్ల.సుబ్బారావు, ఉప్పల కార్తిక్, గోపవరపు మల్లిఖార్జున, గోపవరపు అనిల్, గోపవరపు చెన్నకేశవులు, గోపవరపు ఏడుకొండలు, గజ్వల్లి శ్రీనివాసరావు, ఆత్మూరు వెంకటేశ్వర్లు గ్రామపెద్దలు కొర్లకుంట జానకీ రఘు, ఆర్మీ బుజ్జి, కే కోటిరెడ్డి అంగన్వాడీ కార్యకర్తలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలోని కంభం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పల్నాటి బోడయ్య అధ్యక్షతన గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదట మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్నాటి బోడయ్య మాట్లాడుతూ బాపూజీ దేశ స్వేచ్ఛ కోసం అహింసా శాంతి సత్యం సహనం మార్గాలు అనే పోరాట పటిమ అందరికీ ఆదర్శమని కొనియాదారు. కంభం పంచాయతీ సెక్రటరీ పి.రమేష్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలు కన్న బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి. రమేష్‌రెడ్డి, కంభం సచివాలయం 1 అధికారులు, సిబ్బంది, కంభం పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి సమష్టి కృషి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామ సంఘ పరిధిలో సంఘాల మహిళల అభివృద్ధికి వెలుగు సిబ్బంది గ్రామ సంఘాల ప్రతినిధులు ముందుకు సాగాలని వెలుగు ఏపీఎం ఎం.హనుమంతరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం గ్రామ సంఘ ప్రతినిధులు గ్రామ సంఘ సహాయకులు సంస్థాగత నిర్మాణం,అభివృద్ధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు వ్యాపార అభివృద్ధికి అన్ని రకాల రుణాలు, అవకాశాలను సద్విని యోగం చేసుకొని అభివృద్ధి పరుచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా సంఘ సమావేశాలు నిర్వహించుకొని నెలవారి లావాదేవీలను మొబైల్ బుక్ కీపింగ్ లో నమోదు చేయాలన్నారు. అన్ని గ్రూపులు ఏ గ్రేడులో ఉండే విధంగా వివో ఏలు బాధ్యతగా పనిచేయాలన్నారు. అవసరమైన మహిళలకు వారి వ్యాపార అభివృద్ధికి రుణాలు ఇప్పించాలని, వాటిని తిరిగి సక్రమంగా వసూలు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా 35శాతం రాయితీపై బ్యాంకు రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈ వెంకాయమ్మ, మండల సమాఖ్య కార్యదర్శి కే పేరమ్మ, మండల సమైక్య కోశాధికారి మందలపు సేనావతి, ఉప కార్యదర్శి లక్ష్మి, సీసీలు కోటేశ్వరరావు, రత్నకుమారి, అకౌంటెంట్ మార్తమ్మ పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో మహాత్మగాంధీ వర్ధంతి

విశాలాంధ్ర-పామూరు : మహనీయులు మహాత్మా గాంధీ 77వ వర్ధంతి వేడుకలను స్థానిక మండల వైసీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలుతో ఘన నివాళులు అర్పించారు. దేశ

స్వాతంత్ర్య కోసం ఆయన చేసిన త్యాగాలు సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి,గట్లా విజయభాస్కర్ రెడ్డి, అంబటి కొండారెడ్డి,మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ షైక్ చాంద్ బాషా, జొన్నలగడ్డ గోవిందయ్య, ఎస్టి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీరాం శ్రీనివాసులు,గడ్డం వెంకటనారాయణ రెడ్డి, ఇర్రి వినోద్ రెడ్డి, శ్యామల మాల్యాద్రి రెడ్డి, మునగాల రమణారెడ్డి, కోట వెంకట కృష్ణారెడ్డి, మేళంగి రత్తయ్య, వేముల మధు, షేక్ కాలేషా,మితికల బాలకృష్ణ, షైక్ రసూల్ ఖాన్ పాల్గొన్నారు.

కృషి,పట్టుదలతో చదివితే విజయం

ఎస్సై జీవీ చౌదరి

విశాలాంధ్ర - బల్లికురవ : విజయం సాధించాలనే దృఢ సంకల్పం,కృషి,పట్టుదలతో చదివితే విజయం నీ సొంతమవుతుందని ఎస్సై జీవీ చౌదరి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ జీవీ చౌదరి పాల్గొని మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల భవిష్యత్తుకు పునాది లాంటిదని ప్రణాళిక రూపొందించుకొని చదివితే ఉన్నత శిఖరాలు అవరోధించవచ్చున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు తమ ప్రతిభతో గ్రామం గర్వించేలాగా ఎదగాలని,తద్వారా దేశ అభివృద్ధిలో తమ వంతు పాలుపంచుకోవాలన్నారు.విద్యార్థిని విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులో పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కె సుధాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమ శిక్షణతో కూడిన విద్య నేర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు చేరు కుంటార న్నారు. కళాశాల వార్షికోత్సవం పురస్కరించుకుని విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహు మతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కే హనుమంతరావు,కొణిదెన జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, కళా శాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రమణాయపాలెంలో పశువైద్య శిబిరం

విశాలాంధ్ర-పర్చూరు:మండలంలోని రమణాయపాలెంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగింది. వైద్య శిబిరాన్ని పశు పోషకులు తాటిపర్తి సీతారామరెడ్డి ప్రారంభించారు. అన్నంభోట్లవారిపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ అరుణ సేవలందించారు. ఈ శిబిరంలో 22 పశువులకు చూడి నిర్ధారణ పరీక్షలు, 20 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు నిర్వహించి, దూడలకు, గేదెలకు, గొర్రెలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. పశుపోషకులకు లివర్ టానిక్స్ ఖనిజ లవణ మిశ్రమాన్ని అందించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర-పర్చూరు: మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వ హించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, ఉపతహసీల్దార్ సుధారాణి, ఎన్నికల డీటీ మాధవీలత, వీఆర్ఓల సంఘం అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్వేయర్, వీఆర్ఓలు, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్ శ్రీచరణ్‌కు సత్కారం

విశాలాంధ్ర - అద్దంకి : మండల తహసీ ల్దార్ శ్రీ చరణ్‌ను గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం నందు టీడీపీ నేతలు సత్క రించారు. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న తహసీల్దారును శాలువాతో సన్మానించారు. కార్యక్ర మంలో పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సంధి రెడ్డి రమేష్, తెదేపా నేతలు దామా హనుమంతరావు, మద్దా ఆంజనేయులు, ఇక్కుర్తి కొండలు, పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి రుణాలు మంజూరు

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో బీసీ మరియు ఈ డబ్ల్యూఎస్ కులాలవారికి స్వయం ఉపాధి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ జెనరిక్ మెడికల్ షాపులు కోసం రుణాలను మంజూరు చేసారని జరిగిందని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. రుణాల కోసం దరఖాస్తులను సమీప సచివాలయాల యందు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ కులములవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ తెలిపారు.

పంట పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలన

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మినుము విత్తనాలు మోతాదుకు మించి అధిక మొత్తంలో వేయటం వల్ల మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల పురుగుల ఉధృతి అధికంగా ఉండి దిగుబడిపై ప్రభా వం చూపుతుందని లాం ఫారం కీటక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ గోపాలస్వామి అన్నారు. మండలంలోని ఆరుంబక గ్రామంలో గుంటూరు వ్యవసాయ పరిశోధనా సంస్థ లాం ఫారం నుండి శాస్త్రవేత్తల బృందం పంట పొలాలను పరిశీలించారని మండల వ్యవసాయ అధికారి ఏ మహేష్ బాబు అన్నారు. రేపల్లె హబ్ మేనేజర్ వాగోలు బుష్ ,వ్యవసాయ విస్తరణాధికారి మిద్దె తిరుపతమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో బ్రిడ్జి కోర్సులకు అడ్మిషన్లు

విశాలాంధ్ర - నిజాంపట్నం : పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బ్రిడ్జి కోర్సును నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇందుకు గాను ఐటీఐలో రెండు సంవత్సరాల కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సులో నేరుగా రెండో సంవత్సరంలోకి అడ్మిషన్ పొందవచ్చు అని తెలిపారు. అర్హులైన ఆసక్తి గల అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికేట్‌లను నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వెంటనే సమర్పించాలని చెప్పారు.ఈ బ్రిడ్జి కోర్సును ఫిబ్రవరి 21వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు.పూర్తి వివరాలకు కళాశాల పని దినములో లేదా జి.వెంకటేశ్వరరావు,ఎటిఓ (ఫిట్టర్) సెల్ :9963509246,జి.వి.ఆర్.యన్.ప్రసాదరావు,ఎ.టి.ఓ (యం.సి.డి.) సెల్ :8309914256లను దించాలని అయన సూచించారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: వంశీ

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సౌజన్యంతో శుక్రవారం టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని నిరుద్యోగ యువతీ,యువకులు ఈ ఒక గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి అడే వంశీ అన్నారు.వంశీ మాట్లాడు తూ ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మెగా జాబ్ మేళా నిర్వహించడం పట్ల నిరుద్యోగ యువతీ,యువకులకు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.పదవ తరగతి,ఆపై చదువులు చదివిన ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ, యువకులు 31వ తేదీ శుక్రవారం జరుగు జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించాలని వంశీ కోరారు.బాపట్లలో ఇలాంటి మెగా జాబ్ మేళా నిర్వహించిన ఘనత మన ఎమ్మెల్యేకే దక్కుతుంద న్నారు.అభివృద్ధి,సంక్షేమంతో పాటుగా విద్య,ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కొరకు అహర్నిశలు ఆలోచిస్తున్న ఎమ్మెల్యేను అభినందిస్తూ యువత మేలుకోవాలని వంశీ తెలిపారు.

పెద్దదోర్నాల కుర్రోడికి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ఢిల్లీలో జరిగిన ఖేలో భారత్ పోటీల్లో వాలీబాల్ క్రీడా విభాగంలో దోర్నాల గ్రామానికి చెందిన షేక్ అరాఫత్ బాషా ఆటలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన నందుకుగాను ప్రతిభకు గోల్డ్ మెడల్ దక్కింది. దీంతో యర్రగొండపాలెం నియోజకవర్గానికి దక్కిన గౌరవంగా అందరు అభినందిస్తున్నారు.

తప్పుడు కథనాలపై ఖండన

విశాలాంధ్ర - చీరాల : వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు కథనాలతో ప్రజలను మభ్యపెట్టి పత్రిక విలువలు దిగజార్చవద్దని టీడీపీ పట్టణాధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు అన్నారు.ప్రముఖ దిన పత్రికలో వచ్చిన వైద్యులపై పచ్చ మూకల గూండా గిరి కథనాన్ని ఖండిస్తూ చీరాల గడియార స్తంభం సెంటర్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ కూటమి శ్రేణులు నిరసన చేపట్టి చీరాల మండల తహసీల్దారుకి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చీరాల పట్టణానికి చెందిన కుంచాల కృష్ణవేణి పుట్టుకతోనే ఎడమ కన్నును కోల్పోయిందని, ఆమెకు గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వం పెన్షన్‌ను మంజూరు చేసిందన్నారు.గత ప్రభుత్వం కూడా అదే పెన్షన్‌ను కంటిన్యూ చేసిందని,ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెన్షన్ల రీ వెరిఫికేషన్ చేస్తుండగా పరీక్షల నిమిత్తం వైద్యుల వద్దకు కృష్ణవేణి వెళ్లడంతో నీకు సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదని పాత సదరన్ సర్టిఫికెట్ పని చేయదని వైద్యులు తెలిపారన్నారు.రెండు కళ్ళు లేకపోతేనే సదరన్ సర్టిఫికెట్ ఇస్తామని లేదంటే లేదని వైద్యుల రాజకుమార్ బాధితురాలు కృష్ణవేణికి తెలిపారని బాధితురాలు తనకు న్యాయం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావును కోరగా ఎందుకు సర్టిఫికెట్ ఆమెకు ఇవ్వరని డాక్టర్‌ను అడిగామని,ఈ విషయంపై ప్రముఖ దిన పత్రికలో వైద్యులపై పచ్చ మూకల గూండా గిరి అంటూ తప్పుడు కథనాలు రాసారని వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు కథనాలు రాస్తున్న దినపత్రికపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళులు



విశాలాంధ్ర -చీమకుర్తి: జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా చీమకుర్తి జవహర్ నర్సింగ్ హెూమ్ నందు కుష్టు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు 36వ సహాయ శిబిర నిర్వహణ మరియు సహాయ కార్యక్రమాలు ఘన నివాళులర్పించారు. ఎయిడ్స్,కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, లుంగీలు, పళ్ళాలు,టవల్స్, బనియన్లు, డ్రాయర్లు, మొదలైన నిత్యవసర వస్తువులను అందజేశారు. అంతేకాకుండా సహాయ సేవా కార్యక్రమాలు చాలా నిర్వహించారు. ఇందులో భాగంగా లైన్స్ డిస్టిక్ గవర్నర్ గోపీనాథ్ విచ్చేశారు. మీరు లైన్స్ క్లబ్ నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఎన్ఎస్పి కాలనీలో ఎంపీపీ పాఠశాలలో ఓపెన్ ఆడిటోరియంను, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ చీమకుర్తి నందు వాష్ రూమ్స్ ను, ఐరన్ షెల్టర్ ఉర్దూ స్కూల్ నందు, మల్టీపర్పస్ బిల్డింగ్ 10 లక్షల రూపాయల గవర్నమెంట్ హాస్పిటల్ నందు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి. జవహర్, లైన్స్ క్లబ్ డిస్టిక్ నెంబర్ చలివాది బదరీ నారాయణ, లైన్స్ క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు నూనె హేమ సుందరం, నూనె సుబ్రహ్మణ్యం, లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ నెంబర్ వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, బదిరుల పాఠశాల హెడ్మాస్టర్ అంజిరెడ్డి, నూనె అసుదీప్, పాల్గొన్నారు.

చెన్నుపాడులో పశు ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని చెన్నుపాడు గ్రామంలో గురువారం పశు ఆరోగ్య వైద్య శిబిరం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువులలో సుడి నిర్ధారణ పరీక్షలు దూడలకు మరియు గొర్రెలకు నట్ట నివారణ మందులు తాపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు పుల్లయ్య, శ్రీను, గ్రామ రైతులు వెన్నపూస రమణారెడ్డి, మాలకొండ రెడ్డి పాల్గొన్నారు.

వాడవాడలా మహాత్మా గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర - బాపట్ల : మహాత్మ గాంధీజీ సేవలు అజరామరమైనవి అని తహసీల్దారు షేక్ సలీమా తెలిపారు. గాంధీజీ 77వ వర్ధంతి సందర్భంగా గురువారం పోరంపర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ బోధనలు నిత్య నూతనమైనవి అని సర్వకాలాలలో సర్వదేశాలలో ఆచరణీయమైనవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, సీనియర్ అసిస్టెంట్ సాల్మ న్ రాజు సిబ్బంది భవాని, గౌరీ సాయి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో....

విశాలాంధ్ర - అద్దంకి : జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మీరా బంకు వద్ద ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సత్యం, అహింస యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి పూజ్య బాపూజీ అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళి, సంధి రెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, దివాకర దత్తు, తమ్మన శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో....

విశాలాంధ్ర - చీరాల : దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ తన అహింసా సిద్ధాంతాలతో పోరాడి విజయం సాధించారని టీడీపీ పట్టణాధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం చీరాల నల్లగాంధి విగ్రహానికి ఎమ్మెల్యే మాలకొండయ్య ఆదేశాలతో గజవల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గజవల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలు నేటి యువత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండ్రు రత్న బాబు, కాగితాల ఆంథోని, గుమ్మ వెంకటేష్, మిర్తీ మస్తాన్, గజవల్లి సాయి, రామాంజనేయులు, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో....

విశాలాంధ్ర - బల్లికురవ : జాతిపిత మహాత్ముడిని మండల అధికార యంత్రాంగం మర్చిపోయింది. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఏఒక్క అధికారి కూడా చిన్న పూలమాల వేసి నివాళులర్పించలేకపోయారు. ఆగస్టు 15, జనవరి 26 లాంటి సందర్భాలలో మహాత్ముడి గురించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే అధికార యంత్రాంగం గాని, ప్రజా ప్రతినిధులు కానీ ఏ ఒక్కరికి ఆయన వర్ధంతి గుర్తు లేదు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్ముని విగ్రహం ఈ విధంగా వెలవెలబోతోంది. ఇందులో కొసమెరుపేమిటంటే కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా విధి నిర్వహణలో భాగంగా అక్కడే ఉంటున్నారు.

వీఆర్ఎస్ వైఆర్ఎన్ ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో....

విశాలాంధ్ర - చీరాల : మహాత్మాగాంధీ అహింస సిద్ధాంతాలను నేటి యువత తమ జీవితంలో ఆచరించాలని విఆర్ఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పొగడదండ రవికుమార్ అన్నారు. యలమంచిలి గ్రూప్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్‌చే నడుపబడుచున్న వీఆర్ఎస్ వైఆర్ఎన్ ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలో మహాత్మాగాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ....

విశాలాంధ్ర - నిజాంపట్నం : జాతీపిత మహాత్మగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి అన్నారు. గురువారం నిజాంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ 78వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీకాంతమ్మ, సర్పంచ్ కట్టా పోలేరమ్మ, పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్లలో....

విశాలాంధ్ర - బాపట్ల : మహాత్మా గాంధీజీ ఆశయాల ప్రకారంగా మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో గ్రామ సచివాలయాలు ద్వారా పేదప్రజలకు ఎంతో మేలు జరిగిందని బాపట్ల జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య తెలిపారు. మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం బాపట్ల పట్టణంలో ఉన్న గాంధీ విగ్రహానికి చల్లా రామయ్య పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ గాంధీ నాడు దేశం కోసం తెల్ల దొరలతో శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని ప్రతి ఒక్కరూ ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని తెలిపారు. వైఎస్ జగన్ పాలనలో నాడు-నేడు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చారని పేద పిల్లలు విద్యార్థులకు ఎన్నో పథకాలు అందించారని గుర్తు చేశారు. నేడు కేంద్ర ప్రభుత్వం అలాగే ఈ కూటమి ప్రభుత్వం కూడా గ్రామ వార్డు సచివాలయాలను, ప్రభుత్వ స్కూళ్ళను అభివృద్ధి చేసి పేద ప్రజలకు చదువుకునే పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించాలని చల్లా రామయ్య కోరారు. ఈ కార్యక్రమంలో వినుకొండ డానియేలు, చల్లా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

లేఔట్‌కు అప్రూవల్‌పై అవగాహన

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక మున్సిపల్ ఆఫీసు నందు గురువారం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్నటువంటి లేఔట్లకు వీధిలైట్లు, రోడ్డు మార్గం, డ్రైనేజ్ వంటివి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తేనే లేఔట్లకు అప్రూవల్ ఇవ్వడం జరుగుతుందని ఇటువంటి సౌకర్యాలు లేకుండా లేఔట్‌లో వేస్తే వాటికి అప్రూవల్ ఇవ్వమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్ మాట్లాడుతూ లేఅవుట్లపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు బ్యానర్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్ పాల్గొన్నారు.

కుష్టు రహిత దేశంగా కృషి చేద్దాం

విశాలాంధ్ర-కురిచేడు : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎవరికైనా శర్మ పై స్పర్శ లేని మచ్చలు ఉన్నా చెవులు మీద ముఖం మీద కనితలు ఉన్నా కాళ్లు చేతులపై స్పర్శ తగ్గిన కనురెప్పలు కనుబొమ్మలు వెంట్రుకలు రాలిన కుష్టు వ్యాధి లక్షణాలు అని తెలియజేసి ఎవరి కుటుంబ సభ్యులకు ఉన్న ఇరుగుపొరుగువారు ఉన్న వారిని గమనించి ప్రభుత్వ ఆసుపత్రులు పరీక్ష చేయుటకు ఎండి టి మందులు అందించుటకు సహకరిస్తామని గ్రామ సచివాలయాలలో గురువారం ప్రతిజ్ఞ చేశారు కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని నా కుటుంబ సభ్యులుగా భావించి వారిని ప్రేమతో శ్రద్ధగా చూసుకుంటానని వారిపై ఏ విధమైన వివక్ష చూపకుండా వారికి తగిన చికిత్స అందించడానికి సహకరిస్తానని కుష్టు వ్యాధి పూర్తి నయమవుతుంది సకల వైద్యంతో అంగవైకల్యం నివారించవచ్చునని తెలియజేస్తానని వ్యాధిగ్రస్తుల పట్ల ఏ విధమైన వివక్ష చూపనని ప్రతిజ్ఞ చేయుచున్నాను మనం అందరం కలిసికట్టుగా పనిచేసి మహాత్మా గాంధీ కన్న కలలను సహకారం చేస్తూ భవిష్యత్తులో కుష్టు రహిత గ్రామాలుగా తీర్చిదిద్ది తద్వారా రాష్ట్రం మరియు కుష్టు రహిత దేశంగా చేయుటకు నా వంతు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు చేసుకోండి

ఎంపీడీవో బి. సతీష్‌బాబు

విశాలాంధ్ర-కురిచేడు : బీసీ ఈడబ్ల్యూఎస్ కాపు వర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి పథకాలు అమలు ప్రక్రియను ప్రారంభించిందని ఎంపీడీవో బి.సతీష్ బాబు గురువారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన స్వయం ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 30 నుండి ఫిబ్రవరి 7 వరకు దరఖాస్తులను ఆయా గ్రామ శశివాలయాలలో ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని తదుపరి మండల స్థాయిలో బ్యాంకుల సహకారముతో అర్హత పరిశీలన ఫీల్డ్ వెరిఫికేషన్ అనంతరం ఎంపికైన లబ్ధిదారులకు మార్చి 10 నుండి 20 వరకు రుణమేళ ద్వారా యూనిట్లను ప్రారంభిస్తున్నారు అని ఆసక్తి గల అభ్యర్థులు ఆన్లైన్ బెనిఫిషియరీ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా నిరంతరం క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ముఖ్యంగా రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆమె ఆదేశించారు. గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ తో కలిసి డివిజన్ పరిధిలోని పరిస్థితులపై ఆమె ఆరా తీశారు. సి.పి.డబ్ల్యు.ఎస్., ఎం. పి. డబ్ల్యు.ఎస్., డి.పి. మరియు చేతి పంపుల మరమ్మతులను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభించి 45 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరులు లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా పైనా కలెక్టర్ చర్చించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాలో ఎలాంటి అవకతవకలు లేకుండా దృష్టి సారించాలని అధికారులకు దిశనిర్దేశం చేశారు. వాటికీ సంబంధించిన బిల్లులు త్వరగా చెల్లించేలా సమగ్రంగా యాప్ లో ఆ వివరాలను నమోదు చేయాలని చెప్పారు. ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేయకుండా అక్రమాలకు పాల్పడి నట్లు గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన యాప్ ను కలెక్టర్ ఈ సందర్భంగా ఓపెన్ చేసి ప్రత్యేకంగా పరిశీలించారు. తాగునీటికి ఇబ్బంది కలగకుండా క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించడానికి ఎంపీడీవోలు,

తహసీల్దారులు , ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ. లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది తాగునీటికి ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలలో పరిస్థితిని మరోసారి పరిశీలించాలని ఆమె దిశ నిర్దేశం చేశారు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, ఎర్రగొండపాలెం , తర్లుపాడు, దోర్నాల, కేకేమిట్ల, గిద్దలూరు, దొనకొండ , పొదిలి మండలాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. తాగునీటి సమస్య ఉంటే ప్రజలు తక్షణమే అధికారుల దృష్టికి తీసుకురావటానికి వీలుగా డివిజన్ స్థాయిలో ఒక కాల్ సెంటరును కూడా ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఇన్చార్జి ఎస్.ఈ. డీ.బాల శంకర్, డి.ఎల్.డీ.వో. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, తహసీల్దారులు, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ.లు, ఈఓపిఆర్డిలు పాల్గొన్నారు.

పెన్షన్లు తనిఖీ

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల పరిధిలో ఉన్న ఆరోగ్య పెన్షన్లు జిల్లా వైద్యాధికారులు గురువారం పరిశీలించారు. రావులకొల్లు, పై రెడ్డిపాలెం, పొన్నలూరు, ఉప్పలదిన్నె, ముప్పాళ్ళ గ్రామాలలో లబ్ధిదారుల వివరాలు స్వీకరించి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. మండల వ్యాప్తంగా 15 వేల రూపాయలు పెన్షన్ పొందేవారు 38 మంది లబ్ధిదారులు ఉండగా వారిలో ఒకరు మరణించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో నారాయణ విద్యార్థుల హవా

విశాలాంధ్ర -ఒంగోలు : స్థానిక భాగ్యనగర్ లో ఉన్న నారాయణ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి ఒలంపియాడ్ పోటీ పరీక్షలలో తమ సత్తా చాటారు. జాతీయ స్థాయిలో జరిగిన సీనాప్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలలో విజయఢంకా మోగించారు.

ఈ సందర్భంగా జరిగిన విజయోత్సవాల కార్యక్రమాలలో క్లస్టర్ ప్రిన్సిపల్ వేదవతి, ప్రిన్సిపల్ నిరూప్, ఏది ఆంజనేయులు విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ నారాయణ కరిక్యులం పోటీ పరీక్షలను సైతం తట్టుకునే నిలబడే విధానాన్ని పాటిస్తూ, విద్యార్థులను సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నది తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పథకాలు సర్టిఫికెట్లు బహుకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు వారి సిబ్బందితో దాడులు నిర్వహించారు. మొత్తం 5 గురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9,950 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి శ్రీకాంత్ తెలిపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-త్రిపురాంతకం : అధికారులు మహా శివరాత్రి ఏర్పాట్లు సమన్వయంతో పని చేయాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. త్రిపురాంతకం మండలంలోని బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం రెవిన్యూ, దేవాలయం శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ముందుగా శివరాత్రి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు మాట్లాడారు.ఈ సందర్భంగా వైద్య శాఖ అధికారులు మాట్లాడుతూ ముఖ్యమైన ప్రదేశాలలో మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మార్గం మధ్యలో కూడా వైద్య సిబిరాలు ఏర్పాటు చేయాలనీ సబ్ కలెక్టర్ త్రివినాగ్ సూచించారు.వచ్చిన భక్తుకు ఆరోగ్య పరంగా ఇబ్బంది కలుగకుండా ట్రాఫిక్ నియంత్రించాలి అన్నారు. ఆర్ అండ్ బి అధికారులు మాట్లాడుతూ వైపాలెం త్రిపురాంతకం రోడ్ మంజూరు అయిందని తెలిపారు. అమ్మవారి దేవాలయం, వైపాలెం నుండి వచ్చే దారిలో మధ్యలో వున్నా గుంటలు పూడుస్తామని హామీ ఇచ్చారు. పంచాయితీ రాజ్ శాఖ అధికారులు మట్లాడుతూ ద్ బయో టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కేవలం శివరాత్రి ఉస్తావాలకు అదనపు సిబ్బందిని బయటినుండి తీసుకురావడం జరుగుతుంది అన్నారు.చక్కని పండగ వాతావరణం ఏర్పాటు చేస్తుంటామని హామీ ఇచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నియోజక వర్గ ఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు మాట్లాడుతూ శివరాత్రి ఏర్పాటు నామమాత్రంగా నిర్వహింస్తే సాహించేది లేదు అన్నారు. అధికారులు అందరు ప్రేత్యక శ్రద్ద చూపాలి అన్నారు. శివాలయపై వున్న వాహనాలు నిలువు స్థలంలో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ వారు ప్రేత్యక బస్సులు ఏర్పాటు చేయాలిఅన్నారు. ప్రయానికులకు ఆర్టిసి నుండి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలి అన్నారు. ఆలయ సిబ్బందికి ప్రేత్యేక దుస్తులు ఏర్పాటు చేయాలి అని సూచించారు.ఆర్ డబ్ల్యూ యస్ శాఖ పంచాయతీ పోలీస్, సమన్వయంతో పని చేయుంచాలి అన్నారు. విద్యుత్ శాఖ నుండి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇవ్వటం జరిగింది. ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి తో శివ రాత్రి ఏర్పాట్ల విషయమై మాట్లాడటం జరుగుతుంది అన్నారు.ప్రతి సమస్యకు శాస్విత పరిస్కారం చూపాలని తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు అన్నారు. సాగర్ ప్రధాన కాలువ వద్ద భక్తులకు స్నానాలు ఆచరించడానికి ప్రేత్యేక ఏర్పాటు చేయడం జరిగితుంది అధికారులు తెలిపారు. వచ్చే శివరాత్రిలోగా బ్రిడ్జి పూర్తి చేయాలని సూచించారు.గత ప్రభుత్వం కన్నా మెరుగ్గా శివరాత్రి ఏర్పాట్లు జరిగేలా చూస్తామని ఏరిక్షన్ బాబు హామీ ఇవ్వడం జరిగింది.ప్రేత్యక ప్రాధాన్యత ఉన్నా పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగింది. సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు. పార్టీలకు అతీతంగా పని చేయాలని అన్నారు. గిరి ప్రథక్షణకు ఎటువంటి అంతరాయం కలుగకుండా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి అనుమతులు వచ్చేలా చూస్తామన్నారు. శివరాత్రిలోగా బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసేలా చూస్తాని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఈఓ డిప్యూటీ వైద్య అధికారి శ్రీనివాస్, సిఐ అస్సాన్, యం పి పి రిబకమ్మ,ఈఓ పి ఆర్ డి రామ సుబ్బయ్య,అన్ని శాఖల అధికారులు, సత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి నివాళులు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : జాతి పిత మహాత్మాగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా గురువారం టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడీ వెంకటేశ్వర్లు, యువ పారిశ్రామికవేత్త యారవ శ్రీనివాసులు, స్థానిక సివిన్ పురం రోడ్డులోని ప్రాథమిక పాఠశాల వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. పందిటి హరీష్, యారవ శ్రీనివాసులు, పాలపర్తి రమణయ్య, సయ్యద్ అమీర్ బాబు, దివి మనోహర్, వాయునేని రాఘవ, ఇమ్మడిశెట్టి శ్రీనివాసులు, టిడిపి నాయకులు, సోమిశెట్టి శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పార్టీ కార్యాలయంలో...

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : జాతిపిత మహాత్మా గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా ఒంగోలు పట్టణంలోని వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయం నందు గురువారం ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూశేపల్లి శివప్రసాద్ రెడ్డి మరియు ఒంగోలు పట్టణానికి చెందిన ఇంచార్జ్ చుండూరు రవిబాబు మరియు హనుమంతునిపాడు మండల ఎంపీపీ గాయం సావిత్రి కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి, రవిబాబు,ఎంపీపీ సావిత్రి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో గాంధీజీ ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. అలానే ప్రధానంగా సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకొని దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రను కలసిన అవినాష్ రెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోనే ఉన్న నందనవనం పంచాయతీ నందు ప్రభుత్వ ఆస్పటల్ నందు ఆయుర్వేద డాక్టర్ గా పనిచేస్తున్న అవినాష్ రెడ్డి గురువారం కనిగిరి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి,సానికొమ్ము విజయభాస్కర్ రెడ్డి,పెంచికల రామకృష్ణ,కత్తి తిరుపాలు, మరియు తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కిషోర్ కుమార్ ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-వెలిగండ్ల : వెలిగండ్ల మండలం సాక్షి విలేకరి బక్కా కిషోర్ కుమార్ (54) గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందాడు. బుధవారం రాత్రి అస్వస్థతకు గురి కావటంతో హుటాహుటిన చెన్నైకి తీసుకెళ్లారు. గురువారం మధ్యాహ్నం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుని భార్య , కుమార్తె ఉన్నారు. ఈయన మృతి చెందినట్లు తెలియగానే మండలంలోని పత్రిక విలేకరులు, రాజకీయ నాయకులు అధికారులు దిగ్భ్రాంతి చెందారు. శుక్రవారం నాడు వెలిగండ్లలో అంత్యక్రియలు ఉన్నట్లు బంధువులు తెలిపారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం అందరికీ ఆచరణ యోగ్యమని రేపల్లె నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఆంగ్లేయులపై ఎంతోమంది దేశభక్తులు ఎన్నో విధాలుగా పోరాటాలు సాగించినప్పటికీ అహింసా మార్గంలో గాంధీ నడిపిన ఉద్యమాలకు అప్పుడే ప్రజలు మొత్తం మద్దతు తెలపడంతోనే స్వాతంత్రం సాధ్యమైందన్నారు. కడదాకా ఆయన నమ్ముకున్న మార్గాన్ని అనుసరించి ప్రజల చేత అనుసరింపజేసి ఎందరికో మార్గదర్శకుడు అయ్యాడన్నారు. ఆయనను స్మరించుకోవడం దేశ ప్రజల బాధ్యత అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి కాశీ ప్రభాకర్ రావు వంగర భాను, చంద్రశేఖర్ రెడ్డి రవి రెడ్డి గాలిమోటు రాజశేఖర్ ఈ ఊరి పాపారావు నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ని కలిసిన ఎమ్మెల్యే వేగేశన



విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ రాజభవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఎమ్మెల్యే వేగేశన పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలు గవర్నర్కు వివరించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను చందోలు పోలీసులు,రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. చందోలు ఎస్సై ఆర్. స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేసి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారంతో పోలీస్, రెవెన్యూ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించామని చెప్పారు.ఈ తనిఖీలలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అక్రమంగా మట్టి త్రవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.ఈ తనిఖీలో రెవెన్యూ అధికారిణి అరుణ ప్రసన్న పాల్గొన్నారు.

స్పర్శ కుష్టు నివారణ పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల : స్పర్శ కుష్టు నివారణ పక్షోత్సవాలు సందర్భంగా కలెక్టర్ జె.వెంకట మురళిచే గోడ ప్రతులు,కరపత్రాలు గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 నిర్వహిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ లెప్రసీ ఇంచార్జ్ డాక్టర్ మహమ్మద్ సాదిక్, డిస్టిక్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ప్రద్యుత్ కుమార్,డాక్టర్ బి.వీరబ్రహ్మం ఎఫ్.డీ.పీ నోడల్ ఆఫీసర్,డిస్టిక్ లెప్రసీన్ ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై చంద్రబాబు మోసం

రేపల్లె వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరు గణేష్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారం చేతికించుకున్న తర్వాత దొంగ తిరుగుడు మాటలు మాట్లాడుతూ ప్రజలను నిలువునా మోసం చేసిన చంద్రబాబుకు రాజకీయ భవిష్యత్తు ఉండదని రేపల్లె వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు.గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఒక మేనిఫెస్టోను రూపొందించి ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలుపొందాక వాటికి మొండి చేయి చూపించారన్నారు. ఒక్క సంక్షేమ పథకాన్ని అధికారం వచ్చిన ఏడు నెలల తర్వాత కూడా అమలు చేయకుండా ప్రతిపక్షాలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు.రైతు భరోసా ఇంతవరకు ఇవ్వకుండా రైతులను దగా చేశారన్నారు.అమ్మ ఒడి,విద్యా దీవెన,వసతి దీవెన పథకాలను ఆపేసి విద్యార్థుల ఉసురుపోసుకున్నారన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని వారిని మోసం చేశారన్నారు.నెలకు ప్రతి మహిళకు రూ. 1500లు ఇస్తామని ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు.ఇలా ప్రతి ఒక్క పథకాన్ని ఏదో ఒక కారణంతో ఆపేసి ఎప్పటికీ ప్రజలను ఏమార్చేందుకు ఏదో ఒక కుంటి సాకు చూపిస్తున్నారన్నారు. ప్రతి ఒక్క కారణానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కారణమని చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఎన్నాళ్ళు ఇలా ప్రతిపక్షాలను విమర్శిస్తూ సంక్షేమ పథకాలను ఆపుతారని ఆయన ప్రశ్నించారు.ప్రజలు ఒకసారి ఆయన మాటలను నమ్మి మోసపోయారని ప్రతిసారి అలా మోసపోవటం కుదరదని రాబోయే ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు. చంద్రబాబును గెలిపించి ప్రజలు ఎంత తప్పు చేశారో తెలుసుకున్నారన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి కాలయాపన చేయకుండా సంక్షేమ పథకాలపై దృష్టి సారించి సక్రమమైన పరిపాలనను ప్రజలకు అందించాలని ఆయన కోరారు. మండల పార్టీ కన్వీనర్ వెంకట రామిరెడ్డి,కాశీ ప్రభాకర్ నాంచారయ్య, ఈఊరి పాపారావు,సంగర చంద్రశేఖర్ పాల్గొన్నారు

హామీలు నెరవేర్చలేక కూటమి నేతలు అబద్ధాలు

బాపట్ల పట్టణ వైఎస్ఆర్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా

విశాలాంధ్ర - బాపట్ల : కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన దొంగ హామీలను నెరవేర్చలేక గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు పాలుచేసిందని అబద్ధాలు చెపుతూ వైసీపీ ప్రభుత్వంపై నిందలు వేయటం సరికాదని బాపట్ల పట్టణ వైఎస్ఆర్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా అన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ జగన్ 10 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని అందువల్ల రాష్ట్రం దివాలా తీసిందని మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ జగన్ 14 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశాడని ఏపీని మరో శ్రీలంక లాగ చేశాడని విపరీతంగా ప్రచారం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఏపికి ఆరున్నర లక్షల కోట్ల రూపాయల అప్పులు మాత్రమే ఉన్నాయని స్వయంగా చంద్రబాబు నాయుడు సీఎం హోదాలో అసెంబ్లీ సాక్షిగా చెప్పారని రెండు రోజుల క్రితం బాపట్ల ఎమ్మెల్యే రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల అప్పులు ఉన్నాయని చెబుతున్నాడని నిజం ఏమిటో అర్థం కావటం లేదన్నారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టడానికే ఈ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు చేసిన తప్పులను ఇకనైనా తెలుసుకొని ప్రజల ముందుకు వచ్చి వారికి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేకపోతున్నామని ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు.

పోలీస్ క్వార్టర్స్‌కు స్థలాలు పరిశీలన

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరులోని అద్దంకి దర్శి రహదారి పక్కన గల పోలీస్ స్థలాలను పోలీస్ వెల్ఫేర్ ఆర్ ఐ సీతారామరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ వై నాగరాజు, ఏ ఆర్ ఏ ఎస్ ఐ ఎస్ కోటేశ్వరరావు తో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1901 లో బ్రిటిష్ కాలంలో పోలీస్ క్వార్టర్స్ తోపాటు ఎస్ఐ క్వార్టర్లు, పోలీస్ స్టేషన్ నిర్మించారన్నారు. కాలానుగుణంగా పోలీస్ క్వార్టర్, ఎస్సై క్వార్టర్ తీసివేశారని తెలిపారు. పాత పోలీస్ స్టేషన్ ప్రస్తుతం ఉన్నది. సర్వే నెంబర్ 24 లో మూడు ఎకరాల 66 సెంట్లు భూమిలో పోలీస్ క్వార్టర్స్, పెట్రోల్ బంకు, కళ్యాణ మండపాలు నిర్మించేందుకు ఏర్పాట్లు చేపడతామన్నారు. దర్శి నియోజకవర్గంలోని దర్శి, కురిచేడు, దొనకొండ, మండలాల్లో కూడా స్థలాలు పరిశీలించామని తెలిపారు. త్వరలో ఆ స్థలాలను మనుగడలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతమన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందచేస్తాం

విశాలాంధ్ర - కనిగిరి : స్థానిక అమరావతి గ్రౌండ్ నందు గురువారం అలిమ్కో సమస్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత పరికరాల పంపిణీ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అలింకు సంస్థ ద్వారా ఐదుగురు దివ్యాంగులకు ఉచిత వీల్ చైర్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాల ఎన్డీఏ ప్రభుత్వం అనుకూలంగా ఉంటుందని, ఆయన తెలిపారు. దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధూళిపాళ్ల మల్లికార్జునరావు, మానవతా సంస్థకు చెందిన సోమిశెట్టి శ్రీనివా సులు, దోసపాటి నరసయ్య పాల్గొన్నారు.

నేడే మెగా జాబ్‌మేళా

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సౌజన్యంతో నేడు బాపట్లలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని నిరుద్యోగ యువతి,యువకులు ఈ ఒక గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని టీడీపీ మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి అన్నారు.గురువారం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు బాపట్ల అంటే విద్యా కేంద్రంగా ప్రసిద్ధి చెందిందని,ఇప్పుడు మన బాపట్ల విద్యాతో పాటుగా ఉద్యోగ అవకాశాలు కల్పించే కేంద్రంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మెగా జాబ్ మేళా నిర్వహించడం పట్ల నిరుద్యోగ యువతీ యువకులకు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.పదవ తరగతి,ఆపై చదువులు చదివిన ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ,యువకులు 31వ తేదీ శుక్రవారం జరుగు జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించాలని ఆమె కోరారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటుగా విద్య,ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరకు అహర్నిశలు ఆలోచిస్తున్న మన ఎమ్మెల్యేను అభినందిస్తూ యువత మేలుకోవాలని ఆమె చెప్పారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ,సత్య సాయి సేవా సమితి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరంను నిర్వహించారు.ఈ శిబిరంలో కూచినపూడి పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.హేమ ప్రియ,పశు వైద్య సిబ్బంది పాల్గొని పశువులకు,దూడలకు,గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు, దూడలకు,గొర్రెలకు,మేకలకు సకాలంలో మందులు,టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. ఈ శిబిరంలో సత్య సాయి సేవా సమితి వారు మినరల్ మిక్చర్లు,కాల్షియం మందులు,100 జామ మొక్కలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘం మిల్క్ డైరీ నుండి శ్రీనివాసరావు,సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాసరావు,పున్నయ్య శాస్త్రి,సంగమేశ్వర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.